కథ

# ఆత్మశోధన

- వి. నాగమంజుల

ఆఫీసు నోటీసు బోర్డులో అంటించివున్న "సంతాపసభ" అన్న ప్రకటన, ఆ పక్కనే ముద్రించిన సదరు వ్యక్తి ఫోటోనీ చూసి లోపలికి వస్తున్న ప్రతి ఒక్కరూ, "అయ్యో ! పోయాడా?," "ఖర్మ - ఖర్మ", "ఎప్పుడు?", "ఎలా?" "యాక్సిడెంటా?" అని అనుకుంటూ ఎవరి సెక్షన్స్‌కి వాళ్ళు హడావిడిగా వెళుతున్నారు.

ఆ నోటీసుబోర్డు దగ్గర జనం ఎవ్వరూ లేరని గమనించి అక్కడ అంటించివున్న ప్రకటనని చదువుతున్నారు ఓ ఇద్దరు స్నేహితులు. "మన కార్యాలయ ఉద్యోగి అయిన శ్రీజగన్‌మోహన్, నిన్న అనగా గురువారం ప్రమాదానికి గురై మరణించారు. నేటి సాయంత్రం 5.15 ని.లకు జరుగు సంతాపసభకు అందరూ హాజరుకావలసింది. ఆ కార్యక్రమంతో నేటికి కార్యాలయం మూసివేయబడును." అని వుంది.

ఇంతలో పక్కనే ఆడవాళ్ళ గొంతు వినపడి అటుగా చూశారు ఆ స్నేహితులిద్దరూ.

"ఏయ్ రమా! విన్నావా! మీ సెక్షన్ జగన్ చనిపోయాడట" అంది జానకి.

"అవున్ట, జగన్‌తోపాటు అతని ఫ్రెండ్ సతీష్ కూడా పోయాడుట. ఇద్దరూ బైక్‌మీద వెడుతుంటే వెనుక నుండి టాటా సుమో గుద్దిందిట. నిన్నరాత్రి మాసెక్షనతను ఫోన్‌చేసి చెప్పాడు" అంది రమ.

"పాపం చిన్నచిన్న పిల్లలున్నట్టున్నారు కదూ!" అంది జానకి.

"అవును ఒకపాప, ఒకబాబు. భార్యది మావూరే" అంది రమ. ఇంతలో పక్క సెక్షన్ బాబూరావు, రాజేష్‌లు వచ్చారక్కడికి. "అరె అన్నా ! మన జగన్‌గాడు టపాగట్టిండే తెల్సా?" అంటున్నాడు.

"అవ్ భయ్! మనోడు సిన్మాల హీరో లెక్క బైక్ నడిపినట్టుండు" బాబూరావు అంటుండగానే....

ఇదంతా గమనిస్తూ అక్కడే నిలబడివున్న ఆ స్నేహితులిద్దరిలో ఒకతను ఒక్కసారిగా....

"కాదు-కాదు" అని చెప్పటానికి చేయిచాచి ప్రయత్నిస్తుంటే పక్కనే వున్న రెండో వ్యక్తి అది గమనించి స్నేహితుని భుజంపై చేయివేసి "నీ ప్రయత్నం వ్యర్థం" అన్నట్టు చూశాడు. ఆ చూపు గ్రహించి తన ప్రయత్నం విరమించుకున్నాడు మొదటి వ్యక్తి వాస్తవం గుర్తు చేసుకుంటూ.

అందరినీ గమనిస్తూ నోటీసుబోర్డు దగ్గర నిలబడ్డ 'ఆ' ఇద్దరూ చిన్నప్పటి నుండీ మంచి స్నేహితులు. ఇద్దరి ఉద్యోగాలూ వేరేవేరే ఆఫీసులలో అయినా, ఎప్పుడూ కలిసి తిరుగుతూనే వుంటారు. ఆ విధంగానే ఆ ముందు రోజు బ్యాంకులో పని చూసుకుని వస్తున్న ఆ స్నేహితులిద్దర్నీ యమ వాహనంలా వెనక నుండి టాటా సుమో వచ్చి గుద్ది ఇద్దర్నీ జంటగా యమపురికి పంపింది.

అలా ఆత్మల రూపంలో వున్న ఆ స్నేహితులే జగన్‌మోహన్, సతీష్‌లు.

ఇప్పటిదాకా జరిగిన తతంగం చూశాక నెమ్మదిగా బయలుదేరి రోజూ నిలబడి సిగరెట్టు దమ్ములాగే చెట్టుకిందకి చేరారు వాళ్ళిద్దరూ. "జగన్! ఇన్నాళ్ళూ మనం అందరికీ - అందరూ మనకి కనిపించేవారు. కానీ, ఇవాళ అలా కాదు. మనం మాత్రమే వాళ్ళని చూడగలం - వినగలం గుర్తుంచుకో". అంటూ హెచ్చరించాడు సతీష్.

" అవున్రా! సతీష్! ఇందాకా విషయమే తట్టలేదు. వాడు మా పక్క సెక్షన్‌వాడే. రోజూ గురూ గురూ! అంటూ మాట్లాడేవాడు. మనం బైక్ స్పీడ్‌గా నడుపుతున్నామనే సరికి..... అలా రియాక్ట్ అయ్యాను." అన్నాడు కాస్త

గిల్టీగాఫీల్ అవుతూ.. "అరే పిచ్చోడా! నువు రియాక్ట్ అయి చేయాలనుకున్నా ఏమీ చేయలేవు. తెలుసా!" అంటూ నవ్వాడు సతీష్.

"అవున్రా! ఆ విషయం గుర్తొస్తేనే బాధగా వుంది" అంటూనే.... "ఉరేయ్ సతీష్! నాకో కోరిక వుందిరా! ఇవాళంతా ఇక్కడే వుండి నా గురించీ, మన డెత్ గురించీ నాకు తెలిసినవాళ్లూ, నా క్లోజ్ ఫ్రెండ్స్ - అంతా ఏవనుకుంటున్నారో తెలుసుకుందాం. నా వరకూ నాకు విరోధులంటూ ఎవ్వరూ లేరు. కాబట్టి ఇవాళ్టి నా సంతాపసభకి నేను తెలిసివున్న వాళ్లంతా వచ్చి ఓ రెండు నిమిషాలు నా కోసం బాధపడే ఆ క్షణాలను చూడాలని వుంది. ప్లీజ్‌రా! సతీష్! ప్లీజ్ - కావాలంటే.... రేపు మీ ఆఫీసులో గడుపుదాం. సరేనా!" అంటూ చిన్న పిల్లాడిలా బ్రతిమిలాడుతున్న తన స్నేహితుడు జగన్‌ని చూస్తుంటే తన ఆరేళ్ల కొడుకు వినీల్ గుర్తొచ్చి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి సతీష్‌కి-బయటికిరాని కన్నీళ్ళని కూడా గుర్తు చేసుకుంటూ.

"సతీష్ ! ముందు మా సెక్షన్‌కి వెడదాం పద! అని సతీష్ చేయిపట్టుకుని తన సెక్షన్ కేసి నడిచాడు జగన్.

సెక్షన్‌లో జగన్‌సీటు ఖాళీగా వుంది. గబగబా వెళ్ళి తన సీట్లో కూచున్నాడు జగన్ అలవాటు ప్రకారంగా. అటూ ఇటూ కేశవరావూ, శాంతామేడమ్‌లు రోజూలాగానే కూచుని వున్నారు. సెక్షన్‌లో ఏడుగురూ, సెక్షన్ ఆఫీసర్‌తో సహా అందరూ గంభీరంగా వున్నారు.

"జగన్! మీ సెక్షన్‌లో అందరూ మన విషయం తెలిసి బాధగా వున్నట్టున్నారు కదూ!" అన్నాడు సతీష్, జగన్‌కి దగ్గరిగా జరిగి "అవున్రా!" అని పైకి అన్నా, లోలోపల కాసింత సంతోషం-కాస్తంత గర్వంగానూ వుంది జగన్‌కి. ఎదురు సీటులో మూర్తిగారు, ఆ పక్కనే విశ్వం. ఆఫీసర్ రామకృష్ణగారి పక్కనే క్లర్క్ సునీల్.

గంభీర నిశ్శబ్దాన్ని చీల్చుతూ సెక్షన్ ఆఫీసర్ మూర్తిగార్ని చూస్తూ.... "అందరూ అలా అంటే ఎలా

**జగన్‌కి రక్తం వుడికినంతపనైంది. "ఛీ, ఛీ.... సంస్కారం లేని మాటలు చూడు. అంత పెద్దావిడ వాడూ... వీడూ అంటూ ఒరేయ్ సతీష్ సారీరా!... ఆవిడ నిన్ను కూడా....."**

చెప్పండి మూర్తిగారూ! ఎవరికి వారు మేం చేయం అంటే ఎలా? సీటు కాస్త హెవీసీటే కాదనను. అలా అని ఎవ్వరూ చేయమంటే ఎలా? నేచేయాలా? చెప్పండి. అతనున్నప్పుడు సెక్షన్‌లో ఎవరు లీవ్‌లో వున్నా తనంతట తనే చేస్తాననేవాడు. ఆ సీటుని ఖాళీగా వుంచటానికి వీలులేదు. మీలో మీరు తేల్చుకుని ఓ మాటగా నాకు సాయంత్రానికల్లా చెపితే బావుంటుంది" అంటూ విసవిసా బయటికి వెళ్ళిపోయాడు.

"ఎంకి పెళ్లి సుబ్బిచావుకొచ్చింది అన్నట్టుగా వుంది" - అంటూ గొణిగాడు మూర్తిగారు. ఎవరిమటుకు వారు మేం చేయం అన్నట్టు మొహాలు పెట్టుకుని కూచుని వున్నారు.

సెక్షన్‌లో అందరి గంభీరకారణం తెలిసిన జగన్-సంతోష్‌లు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. జగన్ బిక్కమొహం వేసి సతీష్ వైపు చూస్తూ.....

"ఒరేయ్... ఒక్కరు ఒక్కరు కూడా నే పోయినందుకు కానీ, నాగురించి కానీ ఒక్కమాట- ఒక్కమాట కూడా అనుకోవట్లేదు చూడరా!" అన్నాడు బాధగా.

ఓదారుస్తున్నట్టుగా చేయిపట్టి, "ఎవరి బాధ వారిదిరా! మనం రాకముందే మన గురించి మాట్లాడుకుని వుంటారులే... రా... ఇక వెళ్దాం" అంటూ స్నేహితుడిని లేవదీశాడు సతీష్.

నాలుగేళ్లు సహచర్యం చేసిన తోటివారిని వదలలేక, తనకెంతో ఇష్టమైన తన సీటునీ, తన టేబుల్ గ్లాస్ కింద వుంచుకున్న మంచి మంచి సూక్తులనీ, ఆప్యాయంగా తడుముతూ అన్యమనస్కంగానే

బయటకు కదిలాడు జగన్ బాధగా...

అలా బయటకు రాగానే పక్క సెక్షన్ వాళ్ల మాటల్లో తన పేరు వినిపించి ఆగాడు జగన్... అవెంటనే సతీష్ కూడా.

ఆ మాట్లాడుతున్నది మీనాక్షి మేడమ్...

"జగన్ నాకు బాగా తెలుసు. ఆ సెక్షన్‌కి వెళ్లక ముందు ఈ సెక్షన్‌లో చేశాడుగా. అతనున్నన్ని రోజులూ నేను రిసెప్షనిస్టు జాబ్ కూడా చేసేదాన్ని. అరగంటకో ఫోను, "జగన్ హైక్యా మేడమ్?" అనో, 'జగన్ వున్నాడాండీ?' అంటూనో అతనికి ఫ్రెండ్స్ సర్కిల్ చాలా ఎక్కువ. "వీడితో పాటు పోయాడే వాడి పేరేంటి?.... ఆ... ఆc... సతీష్ అనుకుంటా! వాడు రోజు విడిచి రోజైనా దర్శనమిచ్చేవాడు పళ్లికిలిస్తూ..." అని ఆవిడ అంటుండగానే...

జగన్‌కి రక్తం వుడికినంతపనైంది. "ఛీ, ఛీ.... సంస్కారం లేని మాటలు చూడు. అంత పెద్దావిడ వాడూ... వీడూ అంటూ ఒరేయ్ సతీష్ సారీరా!... ఆవిడ నిన్ను కూడా....." అని అంటుండగానే,

"చూడు జగన్ ఇవన్నీ మామూలే. ఒక్కసారి గుర్తు తెచ్చుకో... మనం కూడా ఇలా అన్నవాళ్లమే... లేడీస్‌ని అదీ... ఇదీ... అని అనుకోం. మనం అన్నవి మర్చిపోయి... మనల్ని అన్నవి పట్టించుకోవటం ఏం బావుంటుంది చెప్పు.... ఇక ఇదంతా వదిలేసేయ్. పద.... పద...." అంటూ ముందుకి కదిలాడు సతీష్.

బ్రతికిలేని మననం ముడుచుకుపోయి విలవిలలాడింది జగన్‌కి. స్నేహితుడి వెనకే నడుస్తూ ఆలోచిస్తున్నాడు జగన్. దీర్ఘాలోచనలో వున్న జగన్ భుజం తడుతూ....

"ఒరేయ్ జగన్! ఇది నువ్వు మొట్టమొదట జాయినయినప్పుడు చేసిన సెక్షన్ కదూ!" అన్నాడు.

"అవునురా!" అన్నాడు జగన్ ఆవైపు చూస్తూ....

ఆ సెక్షన్‌లో ముగ్గురు ఆడవాళ్లూ.... నలుగురు మొగవాళ్లూ వున్నారు. ఓ పక్కగా సువర్ణ, సీతామేడమ్‌లు ఏదో మాట్లాడుకుంటున్నారు.....

"ఒరేయ్! సతీష్ ! ఆమే సువర్ణ. గుర్తుపట్టావా? అన్నాడు జగన్. " ఓ ! నీ సువర్ణ సుందరా! అప్పటికీ ఇప్పటికీ పెద్దగా ఏం మార్పులేదు. కాస్తంతఒళ్ళు చేసింది అంతే. రోజూ ఆమెకి ఎన్ని ప్రదక్షణాలు చేసేవాడివిరా!" అన్నాడు ఏడిపిస్తూ.

"ఛ... ఊరుకోరా! ఏదో పెళ్ళి కాకముందు కాస్త అలా ఫీలయ్యాను. మన ప్రపోజల్ కాదనగానే పక్కకి జరిగిపోయాంగా" అన్నాడు సతీష్.

"సరదా కన్నాను లేరా బాబూ! నాకు తెలియనిదేం కాదుగా!" అని సతీష్ అంటుండగానే, ఆ పక్కనే కూచుని వున్న రాజేశ్వరి మేడమ్‌తో అదే సెక్షన్‌లో వున్న రఘు, జగన్ గురించే మాట్లాడుతున్నాడు. 'నిజం మేడమ్. జగన్ చాలాసార్లు నాకు ఫైనాన్షియల్‌గా హెల్ప్ చేసాడు. ఎప్పుడడిగానా లేదనేవాడు కాదు. తన దగ్గర లేకపోతే వేరే ఎక్కడి నుండైనా తెచ్చి ఇచ్చేవాడు. వాడు మాకందరికీ దేవుడిలా కనిపించేవాడు అవసరానికి మా బ్యాచ్ అంతా వాడిని "కుబేరా.. కుబేరా" అని ఎలిచేవాళ్ళం" - ఆ మాటలు విన్న సతీష్ భుజం తట్టి - "గ్రేట్‌రా! సింప్లీ గ్రేట్ చూసావా ! మంచెప్పుడూ మర్చిపోరురా! వాళ్ళకి నువ్వే దేవుడివిట. సాయంత్రం సంతాప సభలో నీకో పూలదండ ఖాయం " అన్నాడు.

అలా ఇద్దరూ నవ్వుకుని నెమ్మదిగా నడుస్తూ గ్రౌండ్ ఫ్లోర్‌కి వచ్చారు. మళ్ళీ అదే నోటీసు బోర్డు దగ్గర ఓ ఏడెనిమిది మంది నిలబడి మాట్లాడుకుంటున్నారు.

"జగన్‌గాడు మా ఏరియా నుంచే వస్తాడు. మాంఛి జాలీ మెంటాలిటీ. మామగారు వాళ్ళూ మంచి సపోర్టు. ఏ.యస్.రావ్ నగర్లో ఓ బ్రహ్మాండమైన ప్లాట్ కొన్నాడు." అంటూ జగన్ స్థితిగతులన్నీ వివరించాడు ఒకతను.

**"ఎంకి పెళ్లి సుబ్బిచావుకొచ్చింది అన్నట్టుగా వుంది" - అంటూ గొణిగాడు మూర్తిగారు. ఎవరిమటుకు వారు మేం చేయం అన్నట్టు మొహాలు పెట్టుకుని కూచుని వున్నారు.**

"ఆఫీసులో కూడా కనిపించిన వాళ్ళ నెవ్వరినీ వదలడు. హాయ్.... హాయ్.. అంటూ పలకరిస్తాడు. వాడు ఆఫీసులో వున్నదీ.. లేనిదీ.. ఈజీగా తెల్సిపోద్ది. రోజూ ఖచ్చితంగా ఆ చెట్టుకిందే బండాపుతాడు" అంటూ అటుగా చూపిస్తూ.... తనకీ కాస్త జగన్‌కి సంబంధించిన విషయాలు తెలుసని నిరూపించుకున్నాడు ఇంకో అతను.

సరిగ్గా అప్పుడే అక్కడికి ఆడమేళాల గుంపొకటి వచ్చి బోర్డ్ని చూసి.... "5-15కి ఆఫీసు అయిపోతుందట ఈరోజు. అదేదో... ఏరెండింటికో... మూడింటికో... పెట్టొచ్చుగా. హాయిగా ఆ వంకన తొందరగా కొంపలికి పోయేవాళ్లం" అంటోంది ఒకావిడ అక్కసుగా.

జగన్ కళ్లకి శక్తే గనక వుంటే, అతను చూసిన చూపుకి ఆవిడ భస్మం అయిపోయుండేది. జగన్ ఆవేశం-ఆగ్రహం గమనించిన సతీష్.... "కూల్‌డౌన్ అంటావు. అరే... చచ్చాడన్న బాధ ఎవ్వరికీ లేదు. పై పెచ్చు పిచ్చి కూతలు విన్నావా? రోజూ ఆఫీసులో 9-30 నుండి 5-30 దాకా పనిచేస్తున్నట్టే ఆ బిల్డప్. అసలో విషయం తెలుసా నీకు. ఆవిడ రోజూ ఇంటికి జంప్ అయ్యేది ఆ టైమ్‌కే. ఇవాళ యింకా ముందే వెళ్లాలన్న ఆశ అది" అన్నాడు ఆవేశంగా జగన్.

"అరే ! యాద్ కరోరే! మన సి.ఎం, పి.ఎం లు ఎవరైనా చనిపోతే మనమూ ఇలా అనుకునే వాళ్లం కాదా! ఎన్ని జోక్‌లు వేసుకునేవాళ్లం. సబ్ చల్తారే.... సబ్ చల్తా!" అన్నాడు సతీష్, ఫ్రెండ్‌ని అనునయిస్తూ...

'అవునుకదా!' అనుకున్నాడు జగన్ తనలో తను మనసుని మేల్కొలుపుకుంటూ. కాస్త స్థిమితపడ్డాడు ఓ అయిదునిమిషాలకి జగన్.

సాయంత్రం సంతాపసభకి ఇంకా చాలా సమయం వుంది. "ఒక్కసారి ఇంటికి వెళ్లివస్తే?" అన్న ఆలోచన వచ్చింది సడన్‌గా జగన్‌కి అంతే....

ఇంటి వాతావరణం అంతా చాలా గంభీరంగా వుంది. తల్లీ, తండ్రీ, తోబుట్టువులూ, అత్తమామలూ అందరి కళ్లూ వాచి, మొహాలన్నీ వడలిపోయి వున్నాయి. జరిగిందేవిటో తెలియని పసి హృదయాలు మాత్రం అందరూ ఒకచోట చేరే సరికి సంతోషంతో వాళ్ల ఆటల్లో వాళ్ళున్నారు. ఒక్కసారి తన కూతుర్నీ, కొడుకునీ ఆప్యాయంగా కళ్ళతోనే తాకిన మరుక్షణం, లో నుండి దుఃఖం పొంగుకొచ్చింది.

అదిరే మనసుతో సుధ కూర్చునివున్న గదిలోకి అడుగుపెట్టాడు జగన్ భయం భయంగానే. సుధని ఎలాంటి పరిస్థితిలో చూడాల్సి వస్తుందనో! ఒక్కసారిగా వెక్కి వెక్కి ఏడుస్తున్న సుధ గబగబా కళ్ళు తుడుచుకుంటూ దేనికోసమో వెతికింది. మనసు కంపించింది. తన ఉనికినీ, స్మృతినీ సుధ తన మనసుతో తాకిందా? అని అనిపించింది జగన్‌కి. సుధని చూడగానే జాలిగా, బాధగా అనిపించి, భగవంతుడు నిజంగా సుధకి అన్యాయం చేశాడా? అనిపించింది. మరో పక్క తల్లిదండ్రుల పరిస్థితి మరీ దారుణంగా వుంది. కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది అమ్మ. "అమ్మా ! ఏడవకమ్మా! ప్లీజ్" అని ఓదార్చాలనిపించి ఆవిడ పక్కకి వెళ్ళి కూచున్నాడు జగన్. కనిపించని, అందని ఓదార్పు ఆవిరైపోయింది. తన నిస్సహాయతకి తనమీద తనకే జాలేసింది జగన్‌కి. అటు పక్కనే సోఫాలో కూర్చున్న తండ్రి.

"ఇదేం ఖర్మరా నాయనా! మాకు తలకొరివి పెట్టాల్సిన వాడివి, మాకంటే ముందే పోయావా ? ఈ వయసులో మాకు ఈ శిక్ష ఏంటిరా? భగవంతుడా?" అంటూ వెక్కిళ్ళ మధ్య ఏడుస్తూ బావురుమన్నాడు.

ఇదంతా పక్క నుండీ గమనిస్తున్న సతీష్, ఇంటి వాతావరణం జగన్‌ని పిండేస్తోందని భావించి జగన్ వద్దంటున్నా బలవంతంగా మళ్ళీ ఆఫీసుకు తీసుకు వచ్చాడు.

క్యాంటీన్ దగ్గర అయితే చాలా మందిని కళ్ళతో పలకరించుకోవచ్చని అక్కడికి వచ్చారు జగన్ - సతీష్‌లు.... తన కాలేజ్‌మేట్ సుధాకర్ సిగరెట్ దమ్ము లాగుతూ కనిపించే సరికి ప్రాణం లేచి వచ్చింది జగన్‌కి. వెళ్ళి పక్కగా నిలబడ్డాడు. సుధాకర్‌తో పాటు రమణ, శ్రీనివాస్, రాంబాబులు కూడా వున్నారు.

" ఏరా! సుధా ! జగన్‌గాడు నీకు మూడు నెలల క్రితం ఇంటి రిజిస్ట్రేషన్ కోసం డబ్బు కావాలంటే పదివేలిచ్చాడు కదూ!" అన్నాడు రాంబాబు.

"అవున్రా! అడగ్గానే తెల్లారే తెచ్చిచ్చాడు లేదనకుండా!" అన్నాడు సుధాకర్. "వడ్డీకా" అడిగాడు శ్రీనివాస్.

"అబ్బే లేదురా! వాడి పర్సనల్ క్యాష్ యిచ్చాడు" అన్నాడు మళ్ళీ.

"ఇంకేం. వడ్డీ ఎలాగూ లేదు. అసలువాడు ఇక లేనే లేడు.... ఇక ఆ విషయం మర్చిపో" చాలా తేలిగ్గా అన్నాడు రాంబాబు.

సుధాకర్ సమాధానం ఏమిటా? అని ఆత్రంగా చూస్తున్నారు జగన్-సతీష్‌లు.

"ఆఁ ... ఆఁ... నేనూ అదే అనుకుంటున్నాను" అన్నాడు సుధాకర్ తాపీగా. అంతే ప్రపంచం తల్లక్రిందులైనట్లనిపించింది జగన్‌కి.

"ఉరేయ్.. ఉరేయ్! సతీష్! చూడరా! వాడు. పదివేలు పదివేలురా. అవతల సుధా, పిల్లలకి ఈ సమయంలో బాగా ఉపయోగపడతాయి కదరా. వీడికిచ్చిన విషయం సుధకి కూడా చెప్పలేదురా నేను! ఎలా? ఇప్పుడెలా? అంటూ ఆవేశం - బాధల సమ్మేళనమైన జగన్‌ని చూస్తే చాలా బాధ కలిగింది సతీష్‌కి.

"చేతులు కాలాకా... లాభం లేదురా! అందర్నీ తేలిగ్గా నమ్మేశావ్. ప్రపంచం ఏవిటో... కాస్త ఆలస్యంగా తెల్సుకున్నాం. బాధపడకు. అయిన మన మగవాళ్ళకి చాలా చెడ్డలవాటుంది. ముఖ్యమైన విషయాలని కూడా భార్యకి చెప్పం. ఇప్పుడు చూడు. అయినా ఇలాంటి వాళ్ళు విలువలకి తిలోదకాలిచ్చార్రా!" అంటూ నిట్టూర్చాడు. "అసలు... అసలు... మనిషేరా వాడు. దొంగ వెధవ. విశ్వాసం లేదురా వెధవకి! అనుభవిస్తాడురా! తప్పక అనుభవిస్తాడు" అంటూ కసి తీరా తిట్టాడు జగన్, సుధాకర్‌ని.

క్యాంటీన్‌లో భోజనాలు చేసిన వారంతా హడావిడిపడుతూ... "టైమైంది... కార్యక్రమం కరక్టు సమయానికి మొదలవుతుంది" అనుకుంటూ- ఎదురుగా వున్న "సంస్కృతిహాలు" లోకి వెడుతున్నారు. అది గమనించిన జగన్ - తన స్నేహితునితో, "సతీష్ ! ఇవాళేదో మంచి కార్యక్రమం వున్నట్టుంది మా ఆఫీసులో, హాలు బయట నోటీసుబోర్డులో చూద్దాంరా రా" అంటూ అటుగా వెళ్ళాడు.

"మానవత్వం - విలువలు" అనే అంశంపై ప్రసిద్ధ రచయిత, వ్యాఖ్యాత డాక్టర్ ప్రభాకరశాస్త్రి గారి ప్రసంగం" అని వుంది.

స్నేహితులిద్దరూ ఒకరికొకరు ఆ కార్యక్రమానికి వెళదామనే అనుమతిని కళ్లతోనే తెలుపుకుని లోపలికి వెళ్ళారు.

హాలంతా శ్రోతలతో నిండి కిటకిటలాడుతోంది. అందరూ ప్రసంగం కోసం ఆత్రంగా వున్నారు. ఆ క్షణం రానే వచ్చింది. స్వచ్ఛమైన ధవళవస్త్ర ధారణతో, సింధూరం పెట్టుకుని, సంస్కార సంస్కృతి తెలిసిన తేజస్సుతో వున్న ఆ వ్యక్తి వేదికపైకి చేతులు జోడిస్తూ వచ్చి ఆసీను లయ్యారు.

"అందరికీ నమస్సులు. మానవ జన్మ సార్థకతకి మానవత్వం మూలం ఎదుటి మనిషి నుండి ప్రతి ఒక్కరూ ఆశించేది... వాంఛించేది. మానవత్వపు విలువలకి వున్న వెల అమూల్యమైనది. కానీ అదేం దౌర్భాగ్యమో అమూల్యమైన ప్రతిదీ అరుదుగా కనిపిస్తుంది.

సింహం- సింహాన్ని చూసి బెదరదు. పాము మరో సర్పాన్ని చూసి బుసకొట్టదు. విషం చిమ్మదు. కానీ దురదృష్టం అదేమో కానీ, మనిషి మనిషిని చూసి భయపడి

జాగరూకతతో మెలిగే స్థితిలో మనం బ్రతుకుతున్నాం. ఈ స్థితి హర్షించదగింది కాదు. మారాలి.

మానవునికి జన్మతః వచ్చే దుర్గుణాలను సాధనతో జయించవచ్చు. అతి చిన్న విషయాలకి కూడా అంతటి విషపూరిత గుణాలను ఉపయోగించకుండా జాగ్రత్తపడవచ్చు. బంధాలనూ, బాంధవ్యాలనూ బలోపేతం చేసుకునే ప్రయత్నం సాగాలి. వాటిని ఆదరించని, ఆచరించని, అనుభవించని జీవితం నిష్ఫలం. నీ ఒక్కడితో ప్రపంచం ఏర్పడదు. మరో వ్యక్తితో లేదా సమాజంతో కూడినదే ప్రపంచం.

మనిషి జీవనం మహత్తరమైనది. జన్మదిన వేడుకలకి అందరం ఒకచోట పండగలా భావించి సాటి మనిషికి స్వాగతం పలుకుతాం. ఎంతో డబ్బు ఖర్చు చేస్తాం. కానీ, అదే తోటివాడుకానీ, అయినవారుకానీ మరణించినప్పుడు ఎంత మందిమి మనఃస్ఫూర్తిగా ఆ ఆత్మకి వీడ్కోలు పలుకుతున్నాం. ఆలోచించండి. ఓ రెండు క్షణాల మౌనం అమూల్యమైన సంతృప్తిని అందజేస్తుంది. దీనికి ఏ మాత్రం ధనాన్ని వెచ్చించ వసరం లేదు. కేవలం రెండు క్షణాలు మాత్రమే!! నిన్నటి దాకా నీతో వున్న నీ సహవాసికి నీవు చూపించే ప్రతిఫలం ఇదేనా! ఏ ప్రదేశంలోనైనా ఏకాంతంగా నిలబడి ఆ ఆత్మ శాంతిని వేడలేమా? అదేమైన కష్టతరమా? అనితర సాధ్యమా? ఆలోచించండి. విలువలని పాటించే ప్రయత్నం కూడా చేయలేనివాడు మనిషిగా జన్మించి వ్యర్థం.... జీవితం ఓ అపురూపమైన వరం. ఫలప్రదం చేసుకోండి.... సంస్కృతి సంపదను భావితరాలకు పదిలంగా అందించాల్సిన బాధ్యత మనదే....."

అలా సాగుతున్న ఆ ప్రసంగానికి జీవంలేని జగన్, సతీష్‌ల ఆత్మలు బరువెక్కాయి.

ఆర్ద్రత, ఆర్తిల సమావేశం అయ్యింది ఆ మహామహుని ప్రసంగం. బతికుండగా ఆస్వాదించలేని అమృతం ఇదేనా అనిపించింది ఇద్దరికీ. ఆసాంతం శ్రవణానందంగా తిలకించి బయటికి వచ్చారు అందరూ మౌనంగా.

స్నేహితులిద్దరికీ మాట్లాడుకోవాలనిపించలేదు. సంతాపసభ సమయం వరకూ మౌనంగానే గడిపారు.

జగన్-సతీష్‌లు వేచివున్న సమయం రానే వచ్చింది. జగన్‌కి నోట మాట రావట్లేదు. ఆశ్చర్యపోయి చూస్తున్నాడు కళ్ళప్పగించి నిలబడిపోయాడు. కారణం ఏనాడు ఆ కార్యాలయంలో ఓ సంతాపసభకి అంతమంది హాజరు కాలేదు కాని యివాళ అంతపెద్ద హాలూ నిండిపోయింది.

ఆ అపురూపమైన క్షణాన స్నేహితులిద్దరిదీ ఒక్కటే ఆలోచన. తమ మరణం రోజుననే ఇంతమందిలో యింతటి మార్పు! సంతోషం- సంబరం పోటీపడ్డాయి వారిలో.

ప్రసిద్ధ రచయిత తన కలంతోనే కాక - అద్భుతమైన ప్రవచనంతోనూ సమాజాన్ని సంస్కరించ గలడన్న విషయం అర్థమయిన జగన్ తన మనసులోనే ఆ సంస్కర్తకి అందని వందనాలు అర్పించుకున్నాడు.

సంతాపసభకి వచ్చిన సహోద్యోగులందర్నీ నిండుగా, కళ్లారా చూసుకుని, తనకు జీవనయానంలోనూ, మరణంలోనూ సహవాసం చేసిన ప్రాణ స్నేహితుని చేయి అందుకుని, కళ్లు మూసుకుని చివరిసారిగా తమ వారినందర్నీ తలచుకుని

"భవబంధాలను తెంచుకున్న మేము -
భావోద్వేగాలను కూడా వదిలి
మీ అందరి శాంతి వచనాల సమాహారంతో
తిరిగిరాని అనంతలోకాలకు వెళ్తున్నాం.
మిత్రులారా.... సెలవు.
ఇక సెలవ్ !!!"

అంటూ మరో ప్రపంచానికి పయనమయ్యారు జగన్ - సతీష్‌లు.

❀❀❀

*సంక్రాంతి -2005 సందర్భంగా కార్యాలయ స్థాయిలో నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ.*